వెన్నెముక విరిగింది

"విజయరావ్! ఎక్కడికి వెళ్తున్నావ్?'' అంటూ ఎదురుగా కూర్చున్న వ్యక్తి పలకరించేసరికి ఈ లోకంలోకి వచ్చాడు విజయరావు. రైలు కదులుతుంటే పరుగెత్తుకుంటూ వచ్చి ఎక్కిన విజయరావు ఇంకా ఆయాసంతో రొప్పుతూనే ఉన్నాడు. పామును చూసినట్టు వణికిపోయాడు అటు చూసిన విజయరావు. గుండెల్లోంచి పట్టరాని ఆవేశం పెల్లుబికింది. తను ఎవరివల్ల ఇలా మోడుబారిన జీవితం గడపాల్సివచ్చిందో ఆ వ్యక్తే అతను. తనను ప్రతిక్షణం కలవరపరచే ప్రశ్నలకు జవాబు అతనే.

విజయరావుని గతం వెన్నుతట్టి హెచ్చరించింది. అతనితో మాట్లాడవద్దని

ఏమిటి అలా చూస్తున్నావ్? నేను యూనివర్సిటిలో మీ ప్రొఫెసర్ని గుర్తు లేదూ?" అన్నాడు ఆ వ్యక్తి చిరునవ్వు నవ్వుతూ. అతను ఫుల్ సూటులో ఉన్నాడు సన్నగా ఎర్రగా ఉన్నాడు. కళ్ళకు గోల్డుఫ్రేమ్ అద్దాలు. నలుపు, తెలుపు సగం సగం కలిసిన తలవెంట్రుకలు.

"ప్రొఫెసర్!.... ఆ తీయని చిరునవ్వు వెనుక ఎంత విషం ఉంది మిస్టర్ ప్రొఫెసర్! నా జీవితాన్ని ఎదగకుండా సీలింగు పెట్టింది నువ్వేకదూ! ఎప్పుడూ చిరునవ్వు పులుముకొని ఉండే నా ముఖాన అదెలాంటిదో మరచిపోయేటట్లు చేసిందెవరు? ఉత్సాహంగా ఎగిసిపడే నా కోరికల అలలను చిన్నాభిన్నం చేసింది నువ్వే మిస్టర్!"

విజయరావు మనసు అప్రయత్నంగానే గతంలోకి వెళ్ళిపోయింది.

* * *

ఆనాడు విజయరావు యూనివర్శిటి విద్యార్థి. బ్రిలియంట్ స్టూడెంటని పేరుంది. ప్రతి క్లాసులోనూ ఫస్టే. క్లాసుమేట్సు నుంచి ప్రొఫెసర్ల వరకూ ఇతనంటే మంచి అభిప్రాయముంది. విజయరావుకు తాగుడు అలవాటులేదు, ఆడపిల్లలను పూసుకుతిరిగే అలవాటు అసలే లేదు. తన చదువేమిటో తనేమిటో.

ఎమ్.ఎ. ప్రీవియస్ ఫస్టుక్లాసులో పాసయ్యాడు. మార్కులుకూడా సెవెంటీ పర్సెంటొచ్చాయి. తరువాత ఎమ్.ఎ. ఫైనల్‌లో కూడా ఫస్టొచ్చాడు.

పి.హెచ్.డి. చెయ్యాలనేది విజయరావు చిరకాల వాంఛ. క్లాసులో ఎక్కువ పర్సెంటు మార్కులు వచ్చిన ఇద్దరికి రీసెర్చి చేసే అవకాశముంటుంది. విజయరావు ఆనందంగా ఆ ప్రొఫెసర్ దగ్గర రీసెర్చిచేసేందుకు అప్లికేషను పెట్టుకొన్నాడు తెల్లనివన్నీ పాలు, నల్లనివన్నీ నీళ్ళు అని నమ్మే విజయరావుకు తన అప్లికేషను తిరిగి వచ్చాక గాని జరిగిన మోసం తెలియలేదు. విచారించగా తనకంటే తక్కువ మార్కులు వచ్చిన ఇద్దరు ఫస్టుక్లాసు విద్యార్థులను రీసెర్చికి సెలక్టు చేసుకున్నారని తెలిసింది.

గురువుల్ని దైవంగా భావించే విజయరావ్‌కి కడుపు మండిపోయింది.

"నేను మీకేం ద్రోహం చేశాను సార్? నాకింత అన్యాయం చేశారు" అంటూ ప్రొఫెసరు ముందు వాపోయాడు.

"విజయరావ్! నాకేం తెలియదు నాయనా, యూనివర్శిటీ సిండికేట్ ఎవర్ని సెలక్టు చేస్తారో వాళ్ళనే నేను అడ్మిట్ చేసుకోవాలి. నేను నిమిత్తమాత్రుణ్ణి" అంటూ బాధపడ్డాడు.

"నాకంతా తెలుసు సార్ ఎవరేం చేశారో. చూస్తాను! రూల్సుప్రకారం నాకు సీటు ఎట్లా రాదో."

"నీ ఇష్టం విజయరావ్! కాని ఒకటి మాత్రం చెప్పగలను. వచ్చే సంవత్సరము నిన్ను తప్పకుండా తీసుకుంటాము. ఫస్టు ప్రిఫరెన్సు నీకే" అనునయంగా అన్నాడు.

విజయరావు చేసేదేం లేక గుడ్లు నీరు కుక్కుకుంటూ తన దురదృష్టానికి ఎవరిని నిందించాలో అర్ధంకాక అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

తరువాత యూనివర్శిటి సిండికేటుకు పిటిషను పెట్టుకొన్నాడు తనకంటే తక్కువ మార్కులు వచ్చిన వాళ్ళని సెలక్టు చేసుకున్నారని, తన అప్లికేషన్ రిజెక్టు చేశారని దాంతో యూనివర్శిటీ సిండికేట్ ఎంక్వయిరీకి ఆదేశించింది.

రెండు రోజులు గడిచిన తరువాత విజయరావు ఇంటిముందు ఒక స్కూటరు ఆగింది. అందులోంచి తన ప్రొఫెసరు, ఇంకో ప్రొఫెసరు కిందికి దిగారు.

విజయరావు ఇద్దర్నీ లోపలకు ఆహ్వానించాడు. కొత్త ప్రొఫెసరు వచ్చాడు గాని, విజయరావుకు సంబంధించిన ప్రొఫెసరు బయటనే రోడ్డుమీద నిలబడిపోయాడు ఇంట్లోకి వెళ్ళి తల్లిచేత కాఫీ పెట్టించి రెండు కప్పుల్లో కాఫి పోసుకొని వచ్చి ఒక కప్పు లోపలున్న ప్రొఫెసరికిచ్చి, బయట వేపచెట్టు కింద ఉన్న ప్రొఫెసరుకు ఇంకో కప్పు కాఫీ ఇచ్చాడు.

"లోపలికి రండిసార్! లోపలికొచ్చి కూర్చోండి" అన్నాడు.

ప్రొఫెసరు ముఖం చెల్లలేదు. "ఫరవాలేదు బాబూ! ఇక్కడే ఉంటాను" అన్నాడు. అతని దృష్టంతా విజయరావు పూరింటిమీద ఉంది.

"విజయరావ్! ఇంత అర్జంటుగా నిన్ను కలుసుకొనడానికి ఎందుకొచ్చామో తెలుసా?" అన్నాడు లోపలున్న ప్రొఫెసరు.

"నాకేం అర్థం కావటంలేదు సార్" అన్నాడు విజయరావు అమాయకంగా.

"నువ్వు చేసిన పని బాగ లేదయ్యా! అయినా నువ్వింతకు తెగిస్తావని నేననుకోలేదు."

"నేనా, నేనేం చేశాను సార్" కంగారుగా అన్నాడు విజయరావు.

"ఇంకా ఏమి చెయ్యాలేమిటి? మీ ప్రొఫెసరు మీదనే పిటిషన్ పెట్టావు గదయ్యా!"

"సార్! నేను ప్రొఫెసరుమీద విరోధంతో పిటిషన్ పెట్టలేదు. పి. హెచ్.డి చేసుకునేందుకు నేనెందుకు అనర్హుణ్ణో తెలుసుకునేందుకు మాత్రమే పిటిషన్ పెట్టాను. నా పిటిషన్లో నేనెవర్నీ దోషిగా పేర్కొనలేదు.

"నువ్వు పేర్కొనకపోవచ్చు. అందరూ అనుకొనేది ప్రొఫెసర్ని దోషి అనేగదా!"

"మీరెలా అనుకున్నా నాకేం అభ్యంతరం లేదు. నాకు అన్యాయం జరిగింది మాత్రం నిజం."

"దానికి నేనొప్పుకుంటాను విజయరావ్! అతను మీ గురువు గదా! గురువు పరువు తీయటం న్యాయమా?" బ్రతిమాలుతున్న ధోరణిలో అన్నాడు ప్రొఫెసరు.

"సార్ నేను గురువుల్ని దైవసమానంగా చూసుకొనేవాణ్ణి. గురువు అభిమానం చూపించి ఉంటే నా చర్మం ఒలిచి చెప్పులు కుట్టించి వుందును." ఉద్వేగంతో అన్నాడు విజయరావు. అతని కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

కొద్దిసేపు ఆగి అన్నాడు ప్రొఫెసర్.

"ఇంతకీ నువ్వేం చెబుతావ్?"

"నేను చెప్పేదేమిటి సార్? ఎలా జరగాల్నుంటే అలా జరుగుతుంది."

"జరిగేదేముంది? న్యాయం నీపైవుంది. చట్టం ప్రకారం నీకు ఎట్టి పరిస్థితుల్లోనూ పి. హెచ్.డి. లో సీటు ఇవ్వాలి. ఎలాగూ సెలక్షను అయిపోయింది. ఇప్పుడు నీకు సీటు ఇవ్వడంగాక నీ పుణ్యమాని ప్రొఫెసరు ఉద్యోగానికే ప్రమాదం వచ్చేటట్టుంది."

విజయరావు మౌనంగా ఊరుకున్నాడు.

"చూడు విజయరావ్ నీవు విద్యార్థివి మాత్రమే. కాని ప్రొఫెసర్ పరిస్థితి ఇంకో అయిదేళ్ళలో రిటైరవుతాడు. ఈలోపల ఆయన ఉద్యోగానికేదైనా జరిగితే అతని సోషర్ ప్రిస్టేజి ఏం గావాలి. ఫామిలీ, పిల్లలు -ఒకసారి ఆలోచించు."

విజయరావు ఒక్క నిముషం మాత్రం ఆలోచించాడు.

"సరే, ఏం చెయ్యాలో చెప్పండి"

"నీవు మేం చెప్పిన విధంగా ఒక స్టేటుమెంటు రాసివ్వు చాలు" అన్నాడు ప్రొఫెసరు ఆనందంగా.

"అలాగే" అన్నాడు ఒక నిర్ణయానికొచ్చిన విజయరావు.

వెంటనే ప్రొఫెసరు తన చేతిలో ఉన్న బాగులోంచి అంతకు ముందే రాసి పెట్టి ఉన్న స్టేట్‌మెంటు విజయరావు కిచ్చాడు.

అందులో విజయరావు తన రీసెర్చికి అప్లికేషను లేటుగా పెట్టుకొన్నాననీ, ఇందులో ప్రొఫెసర్ తప్పు ఏ మాత్రమూ లేదనీ, అదీగాక తనకు ఈ సంవత్సరం రీసెర్చి చెయ్యాలని లేదనీ, కనుక తన పిటిషన్ మీద ఎంక్వయిరీ డ్రాప్ చేయమని ఉంది.

విజయరావు దాన్ని చూసి అలాగే ఒక స్టేటుమెంటు రాసి కింద సంతకం పెట్టి "సార్ చాలా! ఇంకెక్కడయినా సంతకం పెట్టాలా?" అన్నాడు.

ప్రొఫెసర్ విజయరావుకు షేక్‌హాండిచ్చి భుజం తడుతూ "నాయనా! నీ వల్లి విద్యార్థుల విలువ పెరిగింది. ఒక ప్రొఫెసర్ చేసిన పొరబాటును సరిదిద్దేందుకు తోటి ప్రొఫెసరుగా నేను రావాల్సి వచ్చినందుకు చింతిస్తున్నాను. నన్ను క్షమించు" గాద్గదికంగా అని కర్చీఫ్‌తో కళ్ళు తుడుచుకొని బయటకు కదిలాడు.

బయట ఉన్న ప్రొఫెసరు స్కూటరు స్టార్టు చేశాడు. అతనికి వెనక్కు తిరిగి విజయరావు పైపు చూసే ధైర్యం లేదు. విజయరావు కళ్ళకు నీటిపొరలు కమ్మి దూరమవుతున్న వాళ్ళు అస్పష్టంగా కనిపించారు.

విజయరావు ఆ సంవత్సరమంతా ఇంటిదగ్గరే ఉండిపోయాడు. అప్పుడు ఆతనికి ఇంట్లో వాళ్ళ ఆర్థిక బాధలు పూర్తిగా అర్థమయ్యాయి. ఇంతకాలం వాడేదో, చదువుకుంటున్నాడు, వాడి చదువు పూర్తికాగానే మంచి ఉద్యోగం వస్తుందిలే, ఈ లోపల వాడికెందుకు ఇంట్లో బాధలు చెప్పడం అనుకొని, ఉన్న రెండెకరాల పొలం సాగుచేస్తూ దానిమీద అప్పులు తెస్తూ, అవి చాలక ఇంటిమీద కూడా కొన్ని అప్పులు తెచ్చాడు విజయరావు తండ్రి.

ఇంట్లో పరిస్థితులు ఆతని మనసును వికలం చేశాయి. తను ఉద్యోగం చేయాల్సిన ఆవశ్యకత ఉందని తెలిసింది. అంతకు ముందయితే తనకొచ్చే స్కాలర్ షిప్‌లు, ఇంట్లో తెచ్చే అప్పులతో గడిచిపోయింది. దాంతో పిహెచ్.డి. విషయం గాలికి వదిలేసి ఉద్యోగ ప్రయత్నాలు మొదలు పెట్టాడు. టెన్తు క్లాసు చదివే తమ్ముడు, ఎయిత్ క్లాసు చదివే చెల్లెలుకు పైచదువులు చెప్పించే బాధ్యత తన భుజాలమీద వేసుకున్నాడు.

ఎలాగో తంటాలుపడి చిన్నదో, పెద్దదో స్టేటు గవర్నమెంటులో గుమస్తా ఉద్యోగం సంపాదించుకొన్నాడు. ఇదిగో, ఇప్పుడు మూడేళ్ళ తరువాత ట్రెయిన్‌కి తారసపడ్డాడు, ఒకనాటి తన ప్రొఫెసర్-

"ఏమిటి ఆలోచిస్తున్నావు ? జనరల్ కంపార్టుమెంటులో ఎందుకు ప్రయాణిస్తున్నాననా?" ప్రొఫెసర్ పలకరించాడు.

విజయరావు మాట్లాడలేదు.

"అర్జెంటుగా ఢిల్లీ సెమినార్‌కు వెళ్ళాల్సొచ్చింది విజయరావ్ ! ఇక్కడ రిజర్వేషను దొరకలేదు విజయవాడకు ట్రంక్ కాల్ చేసి ఢిల్లీకి రిజర్వు చేయమని నా ఫ్రెంచ్‌కి చెప్పాను. అక్కడనుంచి ఇబ్బంది ఉండదు."

అయినా విజయరావు మాట్లాడలేదు

"ఏం విజయరావ్, నామీద కోపమా?" అన్నాడు ప్రొఫెసరు.

"పేదవాడి కోపం పెదవికి చేటన్నారు. నాకోపం మిమ్మల్నేం చేస్తుంది?"

"అయితే నువ్వింకా అది మరచిపోలేదన్నమాట!" నిట్టూర్చాడు ప్రొఫెసరు

'ఎలా మరచిపోతాను సార్? నా జీవితాన్ని గాడి తప్పించి గతుకుల బాటలో. పెట్టిన మిమ్మల్ని మరచిపోగలనా' అనుకొన్నాడు మనసులో.

"జరిగిపోయిందేదో జరిగిపోయింది ఆయామ్ వెరీ సారీ! మరుసటి సంవత్సరం వచ్చి చేరుతావని ఎంతగానో ఎదురు చూశాను. కాని నీవు రాలేదు. ఇప్పుడేం చేస్తున్నావు విజయరావ్?"

విజయరావు మౌనాన్ని చూసి మళ్లీ మళ్లీ అడిగాడు ప్రొఫెసరు.

"గొర్రెతోక బెత్తెడన్నట్లు నా జీవితం కుదించుకుపోయింది సార్! మీ చర్య వల్ల నా వెన్నెముక విరిగిపోయింది. ఇక ఎలా లేచి నిలబడగలను? ప్రస్తుతం గుమాస్తాగా బ్రతుకు ఈడుస్తున్నాను. రిటైరయ్యేలోగా మేనేజరు నవుతానన్న భరోసా కూడా లేదు." అన్నాడు.

ప్రొఫెసర్ మనసు జాలితో నిండిపోయింది. తను ఆశ్రిత పక్షపాతానికి పాల్పడి చేసిన ఒక చిన్న తప్పు రత్నంలాంటి ఒక విద్యార్థి బంగారు భవిష్యత్తును ఎలా తారుమారు చేసిందో అతనికి పూర్తిగా అర్థమైంది. తాను ఆదర్శానికి మరో పేరయిన గురువు స్థానంలో ఉండి కూడా న్యాయాన్ని పరిరక్షించ లేకపోయాడు. న్యాయాన్ని పరిరక్షించడమేమిటి, తానే అన్యాయానికి పాలుపడ్డాడు. దీన్ని ఏ న్యాయమూ, ఏ చట్టమూ హర్షించదు.

ఇంతలో రైలు పక్క స్టేషన్లో ఆగింది. అందరూ ఒక్కొక్కరే దిగుతున్నారు. ప్రొఫెసరు విజయరావు వెనకనే ప్లాటుఫారం మీదికి దిగాడు.

వెళ్తున్న విజయరావు భుజం మీద చేయివేసి ఆపాడు ప్రొఫెసరు.

"విజయరావ్! నేను చేసిన తప్పుకు ఆ రోజునుంచి మనస్ఫూర్తిగా బాధపడు తున్నాను. నువ్విలా ముభావంగా ఉంటే నా మనస్సెప్పటికి శాంతించదు. ఇక నైనా నన్ను క్షమించవా?'' బొంగరు పోయిన గొంతుతో అన్నాడు. తను చేసిన పనికి ఆయన చాలా గిల్టీగా ఫీలవుతున్నాడు.

'సార్! మీ మీద నాకు ఈ క్షణం వరకు కోపం ఉన్నమాట నిజమే. కాని ఈ రోజు మీతో సంభాషించిన తరువాత ఆ కోపం ఎగిరి పోయింది. ఒక విధంగా నేను పి.హెచ్.డిలో చేరకపోవడం నా కుటుంబం మంచికేమో! లేకపోతే నేను రీసెర్చి అంటూ ఉన్న ఆస్థిని అమ్మించేవాణ్ణి. ఇంటి దగ్గర ఉండబట్టి ఇంట్లో ఆర్థిక బాధలు తెలిసి ఇపుడు కొంతవరకైనా ఆదుకోగలుగుతున్నాను' అన్నాడు మాటలు తడబడగా.

'చిన్నడివైనా ఎంతో లోకానుభవం సంపాదించావు నాయనా!" అంటూ శిష్యుణ్ణి కౌగలించుకున్నాడు ప్రొఫెసర్.

ఇంతలో రైలు బయలుదేరుతున్నట్లు పెద్దగా కూసింది.

" " "